

శ్రీసాయిదర్శన్‌వారి గురుపూర్ణిమ కానుక

# శ్రీసాయి లీలావిలాసము


**యం.పి.సాయినాథ్**

32, సాయినగర్ కాలనీ, గాంధీనగర్, హైద్రాబాద్-80,

ఫోన్ : 2753 4805


## ఒక మాట.....

సమర్థసద్గురువుగా సాయిబాబా గురుపూజను 1909 గురుపూర్ణిమనాటి నుండి స్వీకరించటం ప్రారంభించారు. ఆ గురురూపంలోనే తల్లి, తండ్రి, దైవము అంతర్గతంగా వుంటాయి. సద్గురుసాయి 15-10-1918న మహాసమాధి చెందారు. అంటే సాయి మనకికలేరు అనే భావం సాయిమూర్తిని ఆరాధించేవారికి ఉత్పన్నమౌతుంది. అదీగాక సాయి సమాధి అనంతరం లీలలను చూపుతున్నారా? అనే సందేహం సాయి మనకు సాయపడని సందర్భంలో కలుగుతూ ఉంటుంది. సాయి మహాసమాధి చెందక పూర్వం కంటే, సాయి మహాసమాధి చెందిన అనంతరం చూపిన మహత్తులు తక్కువేమీ కాదు. తక్కువల్లా సాయిపై నమ్మకం మనం పెట్టుకోకపోవటమే! 'శ్రీసద్గురు సాయిలీలా విలాసం' శ్రీ యం.పి.సాయినాథ్‌గారి రచనలో సాయినాటికి నేటికి ఉన్నారనే నమ్మకం కానవస్తుంది. సమర్థసద్గురు సాయి మననుంచి కోరేది నమ్మకము, ఓర్పు మాత్రమే. అవి ఈనాటి గురుపూర్ణిమనాడు సద్గురుసాయికి మనం సమర్పిద్దాం.

సర్వధారి, గురుపూర్ణిమ **...రావూజీ**

18-07-2008

# శ్రీసాయి లీలావిలాసం

## సాయిబాబా నాడు నేడు

దత్తపంచకంలో ఆఖరి మహనీయుడు సాయిబాబా. చివరకు నదులన్నీ సాగరంలో సంగమించినట్లు, సాయిబాబా సకల దేవీ, దేవతా, సద్గురు ఆచార్యుల సంగమమే. సాయిబాబాలో కానరాని తత్త్వమే వుండదు.

"ప్రేమ మతమే తన మతమని, మానవ కులమే తనకులమని చాటి, అన్ని జీవులలోనూ ఉన్న చైతన్యాన్ని నేనే అని ఉద్బోధించిన సంపూర్ణ దత్తావతారమే శ్రీసాయినాథుడు" అంటారు, సాయిభక్తశిఖామణి శ్రీ మహాభాష్యం రంగాచార్యులుగారు.

"నేను ఒక డాక్టరును. కానీ బాబా డాక్టర్లకే డాక్టరు. వైద్యశాస్త్రాన్ని అధిగమించి, తన దివ్యశక్తితో ఎంతోమంది భక్తులను కాపాడారు. వారి అద్భుతశక్తిని వర్ణించటం మనకు అలవి కాని పని" అని వ్రాశారు డాక్టరు అనిల్‌కుమార్.

సాయిబాబా కేవలం దత్తావతారమేనా? అంటే... కాదు, ఆయన ఇంకా నాథయోగి, కబీరు అవతారం. ఇంకా, ఇంకా అనేక రకాల అభిప్రాయాలు భక్తులలో



చోటుచేసుకున్నాయి. సాయిబాబా ఏ అవతారమైనా ఈ విశాలవిశ్వంలోని "అత్యుత్తమ గుణాల మేలుకలయిక, ఆధ్యాత్మిక అమృతకలశం, సర్వధర్మసమ్మేళనం, సమతామూర్తి" అని అంటారు డాక్టర్ వి.వి.బాలకృష్ణ.

అయితే అంతటి విశిష్టయోగి పూర్వాపరాలు తెలియవు. తెలిసింది ఒకటే. సాయి 1918, అక్టోబరు 15వ మహాసమాధి చెందినా, ఈనాటికీ తనను విశ్వసించిన వారికి కల్పవృక్షం, భజించువారికి కామధేనువు. శ్రీయం.బి.రేగే ప్రఖ్యాత హైకోర్టు జడ్జి... "నేను సాయిబాబాను సృష్టి, స్థితి, లయ కారకునిగా భావిస్తాను. 1918లో వారు మహాసమాధి చెందక ముందు నేను ఆ విధంగా భావించాను. ఇప్పటికీ అదే విధంగా భావిస్తున్నాను. నాకు మాత్రం వారు సమాధి చెందినట్లు లేదు" అని తెలిపారు. ఇది నిజమా ?

### పూర్తిగా పూజించు

### సాయి సమాధికి పూర్వం...

గణేశ శ్రీకృష్ణ కపర్దే కుటుంబమంతా సాయిబాబా భక్తులు. నిత్యము



సాయిబాబాను పూజించేవారు. ఒకరోజు కపర్దే కుమారునికి సాయిబాబా కలలో కన్పించారు. కపర్దే కుమారుడు సాయికి భోజనం పెట్టాడు. సాయి తనకు కలలో కన్పించడం సత్యమా! లేక భ్రమా !అనే ఆలోచన వచ్చింది అతనికి. అతడు ద్వారకామాయిలో నున్న సాయిబాబా వద్దకు వచ్చాడు. అతడు తనను సమీపించగానే సాయిబాబా "రాత్రి నువ్వు నాకు భోజనం పెట్టావు కాని దక్షిణ ఇవ్వలేదు. ఇప్పుడు దక్షిణ ఇవ్వు" అన్నారు. అంటే సాయి కలలో కన్పించటం భ్రమ కాదు సత్యమే. కపర్దే కుమారుడు తన వద్దకు సాయి రావటమే కాక భుజించటం ఆనందాన్ని కల్గించింది. సంతోషంతో దక్షిణ సమర్పించాడు అతడు. దక్షిణ లేనిదే సాయి పూజ పూర్తికాదు. దక్షిణ సమర్పించకపోవటం లోపమే.

### సాయి సమాధి అనంతరం...

సాయిబాబాకు ప్రతి రోజూ ఉదయం కాకడ ఆరతి సమయంలో వెన్న, చక్కెరలను నైవేద్యంగా సమర్పిస్తారు. షిర్డీసాయిబాబా సంస్థానం వారు కాకడ ఆరతికి వెన్న, చక్కెరలను సమర్పించటం మానివేసినట్లుగా సాయిభక్తుడు సగుణ మేరు నాయక్‌కు



స్వప్నం వచ్చింది. సంస్థానంలో విచారించగా, వెన్న, చక్కెరల నైవేద్యాన్ని సంస్థానం మానివేసినట్లు రూఢి అయింది. సాయిబాబాకు వెన్న ప్రీతికరమని ప్రత్యక్షంగా సాయిని సేవించిన సగుణ మేరు నాయక్కు తెలుసు. అందువల్ల తన ఖర్చుతోనే వెన్నె, చక్కెరలను సమర్పించటం తిరిగి ప్రారంభింప జేశాడు. ఇప్పటికీ, సంస్థాన్‌వారు ఆ పద్ధతినే కొనసాగిస్తున్నారు. సాయిబాబా సమాధి చెందకపూర్వం, సమాధి చెందిన అనంతరం కూడా పూజా పద్ధతిలో మార్పును అంగీకరించరు. పూజను సంపూర్తిగా చేయాలి అని సాయి అలా తెలిపారు.

### పటంలో వున్నది సాయిబాబాయే !

### సాయి సమాధికి పూర్వం...

జ్యోతీంద్ర తర్కడ్ సాయిభక్తుడు. అతడు షిరిడీకి వచ్చాడు. ఒక గురుపూర్ణిమనాడు సాయి జ్యోతీంద్రను పిలిచి "నన్ను జనం త్రొక్కుతున్నారు. నా ఎముకలు విరిగిపోతున్నాయి. నువ్వు వెంటనే బయటకు వెళ్ళి నన్ను రక్షించు" అన్నారు. సాయిబాబా ద్వారకామాయిలో సుఖంగా తన ఆసనంపై వున్నారు. అతనికి సాయి మాటలు అర్థం

కాలేదు. ఏమి చేయాలో తోచలేదు. సాయిబాబా మరోసారి, "నీవు బయటకు వెళ్ళి నన్ను రక్షించు... ఈ జన సందోహానికి భయపడవద్దు" అన్నారు. వెంటనే అతనికి భక్తులందరూ దారి ఇచ్చారు. బయటకు వచ్చి క్రింద చూడగా అక్కడ సాయిబాబా చిన్న ఫోటో ఒకటి పడివున్నది. దానిని చూడని భక్తులు, ఆ ఫోటో మీదనే నడుస్తున్నారు. సాయిబాబాకు, సాయిబాబా ఫోటోకు తేడా లేదని అతడు అర్థం చేసుకున్నాడు. వెంటనే ఆ ఫోటోను చేతిలోకి తీసుకుని కళ్ళకు అద్దుకుని, సాయికి తెచ్చి ఇచ్చాడు. సాయి అతనితో, "దీన్ని నీ వద్దనే వుంచుకో మేలు జరుగుతుంది" అన్నారు.

**సాయి సమాధి అనంతరం...**

సాధుభయ్యా సాయిబాబా భక్తుడు. అతడు ఇండోర్‌లో 1937లో ఉంటున్నకాలంలో ఒక కల వచ్చింది. ఆ కలలో సాయి కన్పించి తన మోకాలు క్రింద భాగాన్నంతా చెదలు తిన్నాయని చెప్పారు. సాధుభయ్యాకు సాయిబాబా మాటలు అర్థంకాలేదు.



మరుసటి ఉదయం తన గృహంలోని సాయిబాబా పటంలో సాయిబాబా మోకాళ్ళ క్రింద భాగమంతా చెదలు పట్టి వున్నాయి. అప్పుడు సాయిబాబా మాటలు అర్థమయ్యాయి. జాగ్రత్తగా ఆ చెదలను తీసివేసి, ఆ పటాన్ని పూజలో పెట్టుకున్నాడు అతడు. సమాధికి పూర్వమయినా, అనంతరమయినా సాయిబాబాకు, సాయిబాబా ఫోటోకు తేడాలేదని ఎన్నో నిదర్శనాలను చూపుతూనే వున్నారు.

## సాయిప్రసాదం

**సాయి సమాధికి పూర్వం...**

వామన్ ప్రాణ్ గోవింద్ పటేల్ సాయి భక్తుడు. అతడు షిరిడీలో కొంతకాలం నివసించాడు.

సాయిబాబాకు ప్రతిరోజూ ఒక పదిహేనేళ్ళ అమ్మాయి రంగురంగుల పూలగుత్తిని తయారుచేసి సాయికి సమర్పించేది. సాయి దానిని తీసుకుని, వాసన చూసి, ప్రక్కనే వున్న వామన్‌కు ఇచ్చేవారు. వామన్ సాయి దర్శనానంతరం, తన



బసకు పోతున్నప్పుడు ఎనిమిదేళ్ళ పిల్ల ఆ గుత్తిని అడిగేది. అతడు ఇచ్చేవాడు. ఇలా 7, 8 రోజులు గడిచాయి. సాయిబాబా నాకు ఇచ్చిన వస్తువులను ఎవరడిగితే వారికి ఇచ్చేస్తున్నాను. అలా అయితే బాబా చేతి నుండి వస్తువులు ఎప్పుడూ లభించవు" అని ఆయన ఆలోచించాడు. పూలగుత్తిని ఎప్పుడూ అడిగేఆ పిల్లకు ఇవ్వక తన డబ్బాలో దాచుకున్నాడు. పూలగుత్తి కూడా సాయిప్రసాదమే కదా. సాయికి అతడు అలా దాయటం నచ్చలేదల్లే వున్నది. మరుసటి రోజు నుండి బాబా ఆ పూలగుత్తిని వేరెవరికో ఇవ్వసాగాడు. సాయి మనకు ఏమి ఇచ్చినా, ప్రేమతో అడిగితే సందేహం లేకుండా ఇవ్వాలని వామన్ గ్రహించాడు.

**సాయి సమాధి చెందిన తర్వాత ..........**

సాయి భక్తుడైన డాక్టర్ గవాంకర్, సాయి గీతాయాన్ రచయిత చకోర్ అజ్‌గాంకర్ సాయి సమాధి అనంతరం ద్వారకామాయిలో సాయిపటం ముందు కూర్చుని ప్రార్థిస్తున్నారు. సాయిపటంపై వున్న మూడు మల్లెపూలనుండి ఒక పూవు పైకి ఎగిరి వారి మధ్య పడ్డది. పూవు క్రింద పడాలిగాని, పైకి ఎగిరి పడటం చకోర్‌కు ఆశ్చర్యం



కల్గించింది. ఆ సాయి ప్రసాదం తనకు లభిస్తే చాలనుకున్నాడు. అప్పుడే గవాంకర్ ఆ పువ్వును తీసుకుని తన జేబులో వేసుకున్నాడు. గవాంకర్ చిరకాలసేవలకు మెచ్చి, సాయి ఆ పూవును అతనికి ప్రసాదించారని చకోర్ సరిపెట్టుకున్నాడు. వాళ్ళిద్దరూ అక్కడి నుండి వెళ్ళిపోయారు. కొద్దిసేపటికి గవాంకర్, చకోర్‌ను వెదుక్కొంటూ వచ్చి, అతని చేతిలో సాయి ప్రసాదమైన ఆ పూవును వుంచాడు. ఆ పుష్పాన్ని చకోర్‌కు ఇవ్వవలసినదని సాయిస్వరం తనను ఆదేశించినదని గవాంకర్ చెప్పాడు. ఇది కలా? నిజమా? అని చకోర్ ఆశ్చర్యపడ్డాడు. సాయిబాబా ఎవరికి, ఏది చెందాలో, ఏది అందాలో తానే స్వయంగా నిర్ణయిస్తారు.

## పాము కాటువేయటమే

**సాయి షిర్డీకి వచ్చిన రోజులలో...**

సాయిబాబా ఒకమారు గురుస్థాన్ వద్ద నున్న వేపచెట్టు క్రింద కూర్చున్నారు. కొంతమంది గొల్లపిల్లలు ఆ పరిసరాల్లో ఆడుకుంటున్నారు. ఇంతలో ఒక నాగుపాము పడగవిప్పి ఒక బాలునివైపు చరచరా పోతోంది, దాన్ని చూచి బాలురందరూ పరుగెత్తి

పారిపోయారు. ఆ బాలునికి ఏంచేయాలో తెలియలేదు. పరుగెత్త లేకపోయాడు. సాయి తన స్వస్థానం నుండే "ఏమి? అమాయక బాలుణ్ణి కాటువేస్తావా? వెనక్కు తిరిగివెళ్ళు" అన్నారు పామునుద్దేశించి. పాము కాటు వేసే ధోరణిమాని, సాయివద్దకు వెనువెంటనే వచ్చి తన శిరస్సు ఆయన పాదాలపై వుంచి తిరిగి వెళ్ళిపోయింది. ఆ విషయం షిరిడీలోని వారికి తెలిసింది. సాయి షిరిడీ వచ్చిన తొలిరోజులలో ఇది జరిగింది. సాయి తన కారుణ్యాన్ని అంతటితో ఆపలేదు.

**సాయి సమాధి అనంతరం...**

తన కారుణ్యాన్ని ప్రదర్శిస్తూనే వున్నారు, సాయి ఇప్పుడు కూడా... చీరాల-పేరాల వాస్తవ్యుడైన రావుల దేవేంద్రనాథ్ కుమార్తె ఇందిర. ఆమె తన తండ్రిలాగా సాయి భక్తురాలు. ఆమె తన గదిలో పడుకుని ఏదో ఆధ్యాత్మిక గ్రంథాన్ని చదువుతోంది. ఇంతలో తన తండ్రి 'ఇందిరా, ఇందిరా' అని పిలిచి నట్లనిపించింది. గది బయటకు వచ్చి చూస్తే తన తండ్రి అక్కడ లేదు. ఆమెకు ఆంజనేయస్వామి గుడి నుండి ప్రసాదం పట్టుకువచ్చిన పూజారి కనిపించాడు.



ఆమె ఆ ప్రసాదాన్ని తీసుకొని, తన గదిలో పెట్టి, తిరిగి తన మంచం మీదకు పోబోతుంటే, ఆమెకు తన మంచం మీద పాము కనిపించింది. ఆమె పాము, పాము అని అరవగా కొందరు వచ్చారు. ఆ మంచాన్ని చుట్టుముట్టారు. ఆమె ఆ పామును చంపవద్దని వారిని కోరింది. వారు ఆ పామును తీసుకొని ఊరికి ఆవతల విడిచివచ్చారు. సాయి మనలను విచిత్రరీతులలో ఆనాడు, ఈనాడు కూడా కాపాడుతున్నారు. మనం కూడా ఇతర జీవులను కాపాడాలి.

## భక్తుని ఆకలి

**సాయి సమాధికి పూర్వం...**

సాయిబాబాకు సమర్పింపబడిన వెండిపల్లకికి ఒక షెడ్డు నిర్మించాలని సాయి భక్తుడు రఘువీర భాస్కర్ పురందరే కోరిక. సాయిమాత్రం షెడ్డును వేయనివ్వలేదు. అయినా అంకిత భక్తుడైన పురందరే వూరుకోలేదు. మొండిగా పనిచేయసాగాడు. మధ్యాహ్న భోజన సమయం కూడా దాటిపోయింది. అతడు బసకు రాకపోవటంతో అతని తల్లి, భార్యాబిడ్డలు కూడా భోజనం చేయలేదు. సాయికి ఏ విషయాన్ని తెలుపనవసరం లేదు



కదా! భోజనానికి పొమ్మన్నారు సాయి. "నేను భోజనానికి వెళితే ఇవన్నీ పీకి పారేస్తారు. నేను పని అయ్యే దాకా భుజించను" అన్నాడు పురందరే. "నేను ఆట్లాచేయను. భోజనానికి వెళ్ళు" అన్నాడు సాయి. పురందరేకు సాయిమాట వినిపించింది కాని తిరిగి తన పనిలో నిమగ్నమయ్యాడు. సాయి అక్కడే వున్న కాకాసాహెబ్‌దీక్షిత్ అనే మరో భక్తునితో "ఆ పనికిమాలిన వాడు (పురందరే) భోజనానికి పోకుండా నా ప్రాణం తీస్తున్నాడు. నువ్వైనా పిల్చుకుపో" అన్నారు సాయి. బాబా మాతృమూర్తికి ప్రతిరూపం కదా ! బిడ్డడు ఆకలితో వుంటే ఊరుకుంటుండా!

**సాయి సమాధి అనంతరం...**

హైదరాబాదుకు చెందిన శ్రీ పి.జ్యోతిరాజాను షిరిడీ సాయి సంస్థానం వారు జయకర్ గీచిన చిత్రానికి నకలు గీయటానికి ఎంపిక చేశారు. జ్యోతిరాజా తన అదృష్టానికి సంతసించాడు. ఆయన ఆ చిత్రం గీచినంతకాలం మధ్యాహ్న భోజనం మానివేయాలని సంకల్పించుకున్నాడు. అలా నాలుగు రోజులు గడిచాయి. ఐదో రోజు జ్యోతిరాజాకు బాగా ఆకలి వేసింది. తట్టుకోలేకపోయాడు. "ఇదేమిటి బాబా !" అని మధనపడసాగాడు.



ఐదునిమిషాల తర్వాత ఒక నీగ్రో స్త్రీ పళ్ళెంలో విస్తరాకు కప్పుకొని ఆయనవద్దకు వచ్చి "శివనేశన్‌స్వామివారు ద్వారకామాయిలో బాబాకు నివేదించిన ప్రసాదం పంపారు" అని ఆ పళ్ళేన్ని అక్కడే వుంచి వెళ్ళింది. తాను మధ్యాహ్నం ఉపవాసం వుండరాదని సాయి ఆజ్ఞ అని గ్రహించి శివనేశన్ స్వామివారు పంపిన ప్రసాదాన్ని భుజించారు జ్యోతిరాజా. సాయి సమాధి చెందకపోయినా, సమాధి చెందినా తన బిడ్డలను ఆకలి కడుపుతో ఉంచరు.

## మరచిపోయేవు సుమా !

**సాయి సమాధికి పూర్వం...**

నాచ్నే అనే సాయి భక్తునకు, తోటి భక్తుడయిన సామంత్ ఒక కొబ్బరికాయను,రెండణాలు ఇచ్చి, వాటిని తన తరుపున సాయిబాబాకు సమర్పింపుమని కోరాడు. నాచ్నే సాయికి కొబ్బరికాయ సమర్పించాడు కానీ రెండణాల దక్షిణ మరచిపోయాడు. సాయి వెంటనే "ఆ పేద బ్రాహ్మణుడు ఇచ్చిన రెండణాలు ఇవ్వవేమి? ఒప్పుకుంటే పని సరిగ్గా చేయి, లేకుంటే ఒప్పుకోకు" అన్నారు. రెండణాల సంగతి

జ్ఞాపకం వచ్చి, సాయికి వెంటనే సమర్పించాడు నాచ్నే.

**సాయి సమాధి అనంతరం....**

ఉన్నతోద్యోగి అయిన శ్రీజి.విశ్వనాథం శెట్టి, సాయిభక్తుడు. ఆయన మద్రాసులో ఉన్నప్పుడు శ్రీ బి.వి.నరసింహస్వామిగారిని కలిసి సాయిని గురించి వారు మాట్లాడుకునేవారు. శ్రీనరసింహస్వామి శెట్టిగారిని షిరిడీలోని సాయి సంస్థానానికి ఒక వెండిగంటను సమర్పించమని కోరారు. హనుమంతుని విగ్రహముతో ఉన్న ఒక పెద్ద వెండి గంటను కొన్నాడు శెట్టిగారు. మరునాడు శ్రీనరసింహస్వామి షిరిడీకి పోతుంటే వారి ద్వారా ఆ గంటను షిరిడీ సాయి సంస్థానానికి పంపాలని శ్రీశెట్టిగారి ఆలోచన. ఆ రాత్రి శెట్టిగారు నిద్రించారు. మరునాడు ఆయన గంట సంగతి మరచి మేడమెట్లు దిగి, ఆఫీసుకు పోవటానికి కారుతలుపు తెరిచారు. ఆయన మెట్లు దిగుతున్నంతసేపు, కారు తలుపు తెరిచినా కూడా గంట శబ్దం ఆయనకు వినిపిస్తోంది. ఆ శబ్దం టెలిఫోను గంట శబ్దం కాదు. వెండి గంటను శ్రీనరసింహస్వామి ద్వారా షిరిడీపంపాలనే సంగతి అప్పుడు ఆయనకు జ్ఞప్తికి వచ్చింది. వెంటనే మేడపైకి పోయి, గంటను తీసుకుని వచ్చి



కారు ఎక్కారు శ్రీ శెట్టి. ఆ గంటను శ్రీనరసింహస్వామిగారికి ఇచ్చారు శ్రీశెట్టిగారు. దానిని సాయి సంస్థానంలో అందజేసారు స్వామిగారు. సాయి మనలను మరువడు. తనకు సమర్పింపబడవలసిన వాటిని విడువడు.

**నడచినకుంటివారు**

**సాయి సమాధికి పూర్వం...**

బొంబాయిలో ఒక దుకాణాదారు అయిన శంకర్‌లాల్ కేశవ్‌రామ్‌భట్‌కు కుంటితనం ఉంది. ఒక కాలుమీదే నడిచేవాడు. కుంటితనాన్ని పోగొట్టుకోవడానికి అష్టకష్టాలు పడ్డాడు. చివరకు సాయిబాబాను గూర్చి విన్నాడు. సాయి శరణానందగారి తండ్రితో షిరిడీవెళ్ళి సాయి దర్శనం చేసుకున్నాడు. సాయికి సాష్టాంగనమస్కారం చేశాడు. ఆశీస్సులు కోరాడు. ఇక షిరిడీ నుండి తన ఊరు వెళ్ళాలి. ఆ యిద్దరు భక్తులు, షిరిడీ నుండి బయలుదేరారు. కాలు కుంటితనం తగ్గలేదు. పడవకోసం ఇసుకలో నడవసాగాడు. అంతే అతని కుంటికాలు సరి అయ్యింది. నడువసాగాడు. అక్కడినుండే సాయికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు శంకర్‌లాల్.



**సాయి సమాధి అనంతరం....**

1956లో ఒక ఉపాధ్యాయురాలి కుమారుడు పరీక్ష వ్రాసి ఇంటికి జ్వరంతో వచ్చాడు. కాళ్ళు చచ్చుబడ్డాయి. నడువలేకపోయాడు. మందులతో జ్వరం తగ్గింది, కాళ్ళు మాత్రం నడవలేని స్థితిలో ఉండిపోయాయి. అతని తల్లి ఎన్నో మందులు వాడింది కాని తగ్గలేదు. అతడిని ఎవరో ఒకరు మోసుకొని పోవలసివచ్చేది. అతని తల్లి కుమారునితో షిరిడీ చేరింది. ఆమె ఆరతులకు, పూజలకు హాజరయ్యేది. సమాధి మందిరం వరకు కూలివాడు మోసుకపోవటం నామోషీ అని అతడు గదిలోనే ఉండేవాడు. ఇలా రెండు రోజులు గడిచాయి. చివరి రోజున ఆమె సమాధి మందిరంలోని ఆరతికి వెళ్ళి తిరిగి గదికి వచ్చింది. గదిలో పిల్లవాడు లేడు. ఆమె దుఃఖిస్తూ అన్నిచోట్లా చూసింది. పిల్లవాడు కనపడలేదు. చివరకు ఆ సమాధి మందిరంలోని సాయిని దర్శించటానికి వచ్చింది. అక్కడే ఒక స్థంభానికి ఆనుకొని ఆ పిల్లవాడున్నాడు. సాయి స్వయంగా నడిపించుకుంటూ అక్కడివరకు తెచ్చాడని ఆ పిల్లవాడు చెప్పాడు. అతడు తన తల్లి సాయంతో కొద్ది రోజులు నడిచాడు. ఇక ఎవరి సహాయం అక్కరలేకుండా అతడే నడువసాగాడు. సాయి కృప అటువంటింది, సమాధి చెందిన తరువాత కూడా.



**ఊది అయిపోయింది ?**

**సాయి సమాధికి పూర్వం...**

**ఠాణే రైల్వే స్టేషన్ వద్ద...**

ఒకసారి సాయి భక్తుడైన నారాయణ గోవింద చందోర్కర్ బాంద్రానుండి కళ్యాణ్‌కు తన భార్యతో పోతున్నాడు. రైల్వేస్టేషనులో ఉన్నాడు. అప్పుడు అతని వద్దకు సాయిబాబా ఊది కోసం ఒక వ్యక్తి వచ్చాడు. ప్లేగువ్యాధితో బాధపడుతున్న ఒక యువతికి ఊది కావలసి వచ్చింది. నానా వద్ద ఊది లేదు. ప్లేగువ్యాధి వచ్చిన రోగి పరిస్థితి అర్థం చేసుకున్నాడు నానా. నానా అక్కడే నిలబడి సాయిబాబాను ధ్యానిస్తూ భూమి మీద వున్న మట్టిని తీసి తన భార్య నుదుటన పెట్టాడు. మరల సాయిని ధ్యానించి నానా తన భార్యతో ప్రయాణమైపోయాడు. నానా "సాయి" ధ్యానంతో తన భార్య నుదుటిపై మట్టిని పెట్టిన క్షణంనుండి ఆ ప్లేగు రోగి జ్వరం తగ్గుముఖం పట్టింది. సత్వరమే ఆమె ఆరోగ్యవంతురాలయ్యింది.

**సాయి సమాధి అనంతరం....**

**కాలిఫోర్నియాలో...**

కాలిఫోర్నియాలో లెక్కల ప్రొఫెసర్ సి.సి.చాంగ్. అతడికి బాల్యంనుండి ఉబ్బసపు వ్యాధి ఉండేది. ఏ మందులకు లొంగేది కాదు ఆ వ్యాధి. చాంగ్‌కు సాయి మహత్తు తెలిసింది. అప్పటికే సాయి సమాధి చెందారు. సాయి ఊదిని వాడటం మొదలుపెట్టాడు చాంగ్. వ్యాధి అదుపులోనికి వచ్చినట్లే. అయితే అప్పుడప్పుడు ఆ వ్యాధి బయటపడేది. శ్వాస పీల్చుకోవటం కష్టమైనప్పుడుడల్లా సాయి ఊదిని వాడేవాడు. అయితే ఆనాడు సాయి ఊది కావాలంటే అర్థ ప్రపంచ యాత్ర చేయాల్సి వచ్చేది. అంటే ఊది దొరికేది కాదు. అప్పుడతనికి ఒక ఆలోచన వచ్చింది. శ్వాసపీల్చుకోవటం కష్టమైనప్పుడల్లా, అతడు సాయిబాబా ఊదిని ధ్యానించటం మొదలుపెట్టేవాడు. అంతే! అతని శ్వాస మెల్లమెల్లగా ఆడటం మొదలుపెట్టేది. అతనికి సాయి ఊధిపై నమ్మకం అలాంటిది. అది వమ్ము కాలేదు, పోయింది వ్యాధి. మిగిలింది సాయిపై భక్తి.



**పెళ్ళికావాలి...**

**సాయి సమాధికి పూర్వం...**

అబ్దుల్ సాయిసేవకుడు. అబ్దుల్‌కు పెండ్లి కావలసిన కుమారుడు ఉన్నాడు.కాని పిల్లనిస్తామని ఎవరూ ముందుకు రావటంలేదు. ఎందుకంటే అబ్దుల్ ఒక ఫకీరు. అతని కుమారుడు ఫకీరు కావచ్చునని సంబంధాలు రావటం లేదు. ఈ సంగతినే సాయిబాబాకు విన్నవించుకోగా "బాధ పడవద్దు ! అబ్బాయికి మంచి సంబంధం దొరుకుతుంది. సమయం వచ్చినప్పుడు అంతా సవ్యంగా జరుగుతుంది" అనేవారు. అలా చాలా కాలం గడిచింది. కొన్నాళ్ళకు సాయి చెప్పినట్లే సంబంధం వచ్చింది. ఎందుకైనా మంచిదని 'పెండ్లికుమారుని తండ్రి ఫకీరు' అని ముందే పెండ్లి కుమార్తె వారికి చెప్పారు. ఆమె తండ్రి "నాకా పట్టింపు లేదు" అన్నాడు. తన మొదటి కుమార్తెకు వివాహం కాకున్నా రెండోకుమార్తెను అబ్దుల్ కుమారునికి ఇచ్చి చేశాడు. సాయి చెప్పినట్లు ఓర్పుతో మనం ఉండాలి. అలా అన్ని ఆయనే సమకూరుస్తారు.



**సాయి సమాధి అనంతరం......**

మోరేశ్వర బాలకృష్ణ చౌహాన్ సాయి భక్తుడు. అంతేకాదు అతని తల్లికూడా సాయిభక్తురాలు. చౌహాన్‌కు పెళ్ళికావలసిన చెల్లెలు ఉంది. ఒకసారి పెండ్లిచూపులలో చౌహాన్ చెల్లెలు నచ్చిందని మగపెండ్లివారు చెప్పారు. కానీ, ఎంత కాలానికి వారినుండి ఉత్తరం రాలేదు. ఉత్తరం కోసం చూచి, చూచి విసిగిపోయిన చౌహాను తల్లి సాయిబాబా పటం ముందు నిలబడి నిష్ఠూరంగా మాట్లాడింది. ఆ రాత్రికి ఆమెకు సాయి కలలో కనపడి, తనపై కోపం వద్దన్నారు. అదే కలలో ఉదయం 9 గం॥లకు మగ పెండ్లివారి వద్దనుండి ఉత్తరం వచ్చినట్లు ఆమెకు కనిపించింది. ఆమె నిద్రలేచిన తరువాత ఆ కలసంగతే మరచిపోయింది. ఆమె తన కుమారునికి అన్నం వడ్డిస్తోంది. సరిగ్గా సమయం 9 గంటలయ్యింది. పోస్ట్‌మాన్ వచ్చి సంబంధం ఖరారు అయినట్లు మగ పెళ్ళివారినుండి వచ్చిన ఉత్తరాన్ని ఇచ్చి వెళ్ళారు. ఆమెకు గత రాత్రి కల జ్ఞప్తికి వచ్చింది. సాయి ఆయనకు ఏది సమంజసమో అదిచేస్తారు. మన కోరికను తీర్చలేదని నిష్ఠూరంగా సాయిని నిందించనక్కరలేదు.



**అవమానించవద్దు....**

**సాయి సమాధికి పూర్వం...**

మహదేవ్ వామన్ సపత్నేకర్ న్యాయవాది. సాయిభక్తుడు కాదు. అతనికి కుమారుడు పుట్టిపోయాడు, మనశ్శాంతి కరువైంది. షిరిడీలో సాయిని సందర్శించమన్న తండ్రి సలహాను పాటించలేదు కూడా ! అయినా, తండ్రి బలవంతం మీద షిరిడీ వెళ్లి సాయిని సమీపించాడు. సాయి అతనిని కసురుకున్నాడు. సాయి అతనిని అలా కసురు కోవటానికి కారణం తెలిసింది. ఒకప్పుడు అతని స్నేహితుడు షేవడేతో సాయిబాబాను పరిహసించి, చులకనగా మాట్లాడిన సంగతి గుర్తుకువచ్చింది. సపత్నేకర్ తన తప్పును తెలుసుకుని నిజంగా పశ్చాత్తాపం చెందాడు. ఈ మార్పు తన భక్తునికి వస్తే చాలునన్నదే సాయి భావన. మరల సపత్నేకర్ సాయిని సందర్శించినప్పుడు అక్కడున్నవారితో సాయి "ఈ పెద్దమనిషి తనకొడుకును నేను చంపానను కుంటున్నాడు. లోకుల బిడ్డలను నేను చంపుతానా? వీడి భార్య గర్భంలో నేను మరొక కొడుకును ప్రవేశపెడతాను" అన్నారు. సాయికి తనపై కోపం పోయిందని సపత్నేకర్ సంతసించాడు. సాయిమాట వృథా కాదు.

అతనికి సంవత్సరంలోగా కుమారుడు జన్మించాడు. భార్యాబిడ్డలతో మరల సాయి దర్శనం చేసుకున్నాడు సపత్నేకర్. ఆదర్శభక్తుడయ్యాడు సపత్నేకర్.

**సాయి సమాధిచెందిన తరువాత....**

ఆబాసావంత్ సాయిభక్తుడు. కాని అతని భార్య సాయిభక్తురాలు కాదు. ఒకరోజున ఆబాసావంత్ ఒక చీరను కొని, తన భార్యకిచ్చి "ఈ చీరను సాయిబాబా నీకిచ్చాడు" అన్నాడు. సాయిపై నమ్మకంలేని ఆమె "మీరు కష్టపడగా వచ్చిన డబ్బుతో చీరను కొన్నారు. దీనికి సాయిబాబాకు సంబంధం ఏమిటి? అన్నది. ఆ రాత్రి ఆమె చీర ఎలా ఉన్నదో చూద్దామని ప్యాకింగ్ విప్పింది. చీరను చూసి దిగ్భ్రాంతి చెందింది. చీర ముక్కలై ఉన్నది. పూర్తి అహంకారంతో ఉన్న ఆమెకు సాయిపై నమ్మకం అప్పటివరకూ లేదు. ఆమెకు ఏంచేయాలో తెలియలేదు. ఆమె "సాయిబాబా ! నాకు కొత్తచీర లభిస్తే మీగురించి నేను అనిన మాటలు తప్పు అని నమ్ముతాను. నన్ను క్షమించండి" అని ఆమె సాయిని ప్రార్థించింది. తెల్లవారింది. చాలాకాలంగా రావలసిన డబ్బు అకస్మాత్తుగా వచ్చింది ఆబాసావంత్‌కు. ఆ డబ్బుతో ఆమెకు చీర కొని తెచ్చాడు ఆబాసావంత్. యోగులను అనుమానించరాదని సాయి ఆమెకు అటువంటి అనుభవం ఇచ్చాడు.



## ఏమిటి ! ఆత్మహత్యా!!

**సాయి సమాధికి పూర్వం...**

గోపాల్‌నారాయణ అంబాడేకర్ గవర్నమెంటు ఉద్యోగం చేసేవాడు. జీవితం సాఫీగా సాగేది. ఉద్యోగం ఊడింది. కష్టాలు మొదలయ్యాయి. సాయి భక్తుడయ్యాడు. అయినా పరిస్థితి మారలేదు. షిరిడీలోనే ఆత్మహత్యకు సిద్ధపడ్డాడు. అదే సమయంలో సగుణ మేరు నాయక్ అనే భక్తుడు వచ్చి అక్కల్‌కోట మహరాజు జీవితచరిత్రను ఇచ్చి చదవమంటాడు. అతడు పుటలు తిరగవేయసాగాడు. ఒకచోట ఆగాడు. అక్కడ తనలాంటివాడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కల్‌కోట మహరాజ్ స్వయంగా బావిలోకి దూకి అతనిని పైకి తెచ్చి కష్టాలను కాస్త ఓపికతో భరించమన్నాడు. అతడు అలాగే చేస్తాడు. ఇక్కడ అంబాడేకర్ కూడా తన మనస్సును మార్చుకున్నాడు. సగుణ మేరు నాయక్ ద్వారా తన మనస్సును మార్చిన సాయికి ధన్యవాదాలు చెబుతాడు. జీవితాన్ని ఇంకాస్త ఓపికతో గడుపుతాడు. జ్యోతిశ్శాస్త్రం నేర్చి, ప్రవీణుడై ధనవంతుడౌతాడు. సకలసుఖాలను అనుభవిస్తాడు, సాయిసద్గురువుపై ప్రేమ, భక్తిఎక్కువవుతాయి.



**సాయి సమాధి అనంతరం....**

ప్రముఖ తెలుగురచయిత శ్రీపుట్టపర్తి నారాయణాచార్యులు ఈశ్వరానుగ్రహంతో శివతాండవం రచించారు. కాని, జీవితంలో ఏదో అసంతృప్తి వారిని వెంటాడుతుండేది. గృహపరిత్యాగం చేసి దేశాటన చేశాడు. చిత్తం శాంతించలేదు. హిమాలయాల్లోని ఒక కొండ చరియపైకి వెళ్ళి ప్రాణత్యాగం చేయబోయాడు. అది గమనించిన ఒక వ్యక్తి ఆయనతో ఆంగ్లంలో మాట్లాడి, ఆయనను శాంతపరచి, అనునయ వాక్యాలను పలికి వాత్సల్యం అందించారు. క్రమంగా ఆయనకు శాంతి లభించింది. ఆయనలోని క్లేశాలు తొలగిపోయాయి. జీవితం జీవించటానికేనని ఆయన అంగీకరించాడు. అక్కడినుండి ఆయన తిరిగివచ్చాడు. ఆనాడు తనను ఆత్మహత్యా ప్రయత్నం నుండి కాపాడినది మొదలు మరణానంతం కంటికి రెప్పవలె వెన్నంటి తనను కాపాడినవారు సాయినాథులేనని నారాయణాచార్యులవారు తెలిపారు. సబూరి అంటే ఓపిక. ఓపికతో జీవించాలి. అసహనం పనికిరాదు అని సాయి ఎప్పుడూ తెలిపేవాడు.



## భక్తునివద్దకే ఊది ...

**సాయి సమాధికి పూర్వం...**

తనను దర్శించి తిరిగి వెళ్ళిపోతున్న ఒక కొంకణ దేశ భక్తునితో సాయిబాబా "రైలులో నీ దగ్గర కూర్చోవడానికి జానెడు స్థలం అడిగిన వ్యక్తికి ఈ ఊది పొట్లం ఇవ్వు" అన్నారు. "అలా ఎవరూ రాకపోతే, ఆ సంగతే మీకు ఉత్తరంలో వ్రాస్తాను" అన్నాడు భక్తుడు. ఊది పొట్లం తీసుకొని, అతడు ప్రయాణం చేస్తున్నాడు రైలులో, చాలా సేపు నిరీక్షించాడు. ఎవరూ తన వద్దకు రాలేదు. తాను దిగవలసిన స్టేషను కూడా ఇక తొందరలో వస్తుంది. ఇంకెవ్వరూ రారని, సాయికి ఉత్తరం వ్రాయబోతుంటే, అదారాబాదరాగా ఒక వ్యక్తి పరుగెత్తి రైలు ఎక్కి, తనకు ఆరోగ్యం బాగులేదని, తలతిరుగుతున్నదని, ఒక జానెడు స్థలం ఇవ్వమని అడిగాడు ఆ కొంకణ దేశస్థుణ్ణి. అపుడు ఆ కొంకణుడు ఆ వచ్చిన వ్యక్తి (జోషి)కి స్థలం ఇచ్చి, సాయి ఇచ్చిన విభూతి పొట్లం కూడా ఇచ్చాడు. జోషి ఆనందబాష్పాలు రాల్చాడు. ఎంత ప్రయత్నించినా షిర్డీకి వెళ్లలేకపోతున్నానని సాయి కరుణించి ఊదిని అందజేసారని సాయి తనపై

చూపిన వాత్సల్యానికి సాయికి మరోమారు కృతజ్ఞతలు తెలిపాడు.

**సాయి సమాధి అనంతరం.....**

గాయంతో ఆస్పత్రిలో ఉన్నాడు శ్రీపాద బాలకృష్ణదేవ్. అతడేకాదు, అతని తండ్రి శ్రీబాలకృష్ణ విశ్వనాథ్‌దేవ్ కూడా సాయి భక్తులే. గాయంతో ఉన్న శ్రీపాదుడు అక్కడకు వచ్చిన అతని స్నేహితునితో "మైనతాయికి ఊది పంపినట్లు సాయి నాకు ఊది పంపితే బాగుండును" అన్నాడు. "మీ నాన్న గొప్ప సాయిభక్తుడు. నీవు కూడా అంతే. మరి సాయి ఊదిని ఎందుకు ఇవ్వడు? తప్పక ఇస్తాడు" అని బదులు చెప్పాడు అతని స్నేహితుడు. మరునాడు శ్రీపాదుని మరొక స్నేహితుడు శంకరరావు వచ్చాడు, "నిన్న నేను షిరిడీలో ఉన్నాను. షిరిడీలో ఉన్న మన స్నేహితునికి నీ గాయం గురించి చెప్పాను. అతడు వెంటనే ఊది ప్రసాదం ఇచ్చి నీకు ప్రత్యేకంగా ఇమ్మన్నాడు" అని ఊది ప్రసాదాన్ని శ్రీపాదుని చేతిలో పెట్టాడు.

ఈ సంఘటన సాయి సమాధి అనంతరం 33 సంవత్సరాలకు జరిగింది. సాయి సజీవంగా ఉన్న అనుభూతితో శ్రీపాదుడు పరవశించిపోయాడు.



## నేనున్నాను

"సాయిబాబా నిస్సందేహంగా అద్భుతశక్తి కలవారు. సాధుపురుషుడు. ఇస్లాం (సూఫీ) సాంప్రదాయాలను బట్టి సాధుపురుషులకు మరణం ఉండదు" అంటారు, సాయి భక్తుడైన రజబ్ ఆలీ మహమ్మద్ ఖోజా. "శతమాతృపితృసమానాయ సాయినాథాయ" అని ఎలుగెత్తి చాటారు శ్రీబషీర్‌బాబా. మాజీ సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్, శ్రీయం. హిదయాతుల్లాగారు ఎంతో స్ఫూర్తి, శ్రద్ధ, భక్తి మహిమలతో కూడిన ధర్మనిష్ఠగల వ్యక్తి అని సాయిని కీర్తించారు. సాయికి మరణం లేదు. సాయి మరణించాడేమోనని భ్రమచెందే భక్తులకు సాయి ఈ క్రింది వాక్కులు తెలిపారు.

**"నా సమాధి నుండి నా మానుష శరీరం మాట్లాడును."**

**"ఈ భౌతిక దేహానంతరం నేను అప్రమత్తుడనే".**

**"నా భక్తులకు రక్షణ నా సమాధి నుండియే లభించును."**

**"నన్నాశ్రయించినవారిని, నన్ను శరణుజొచ్చువారిని నిరంతరము రక్షించుటయే నా కర్తవ్యము".**



సమాధి చెందిన తర్వాత "శ్రీసాయి బాబా ఎక్కడికి వెళ్ళారు? ఇదివరకు ఎక్కడెక్కడవున్నాడో అక్కడే వున్నాడు. అంతా వ్యాపించివున్నాడు. మహాసమాధికి పూర్వం కంటే వెయిరెట్లు ఉత్సాహం, ప్రేమ, శ్రద్ధలతో తన బిడ్డలను వెన్నంటి ప్రతిక్షణం రక్షిస్తూనే ఉన్నారు. భక్తి శ్రద్ధలతో బాబాను గూర్చితెలుసుకొన గోరువారు ఏ క్షణాన్నయినా దీనిని తెలిసికొనగలరు" అని సాయి సమాధి చెందకముందు సేవించి, సాయి సమాధి అనంతరం కూడా ఆయన లీలలను ప్రత్యక్షంగా అనుభవించిన సాయిభక్తుడు ధుమాల్ వ్రాశారు.

"మహనీయులందరిలో కోహినూర్ వజ్రంవంటివారు ఆ సాయి. వారి నుండి ఎంతటి అమూల్యమైన వరాలనైన మనం పొందవచ్చు. మన భావమెంతో వారి సాయమంత ! ఏం కోరితే అదంతా ప్రసాదిస్తారు. కేవలం వారిని ఇహలోకపు కోరికలకే పరిమితం చేసి, చేసిన సాధనలతో తృప్తిపడితే నష్టపోయేది మనమే" అన్నారు డాక్టర్ విమలాశర్మగారు. శ్రీ సత్యపదానంద ప్రభూజీ అంటారు, "బాబావంటి మహత్తర పెన్నిధి దొరికిన తర్వాత అల్పమైన, అశాశ్వతమైన వస్తువులపట్ల మమకారాన్ని పోగొట్టుకొనకపోతే, బంగారు కలశంలో అమృతాన్ని ఇస్తే, దాంతో కాళ్ళు కడుక్కున్నట్లే అవుతుంది. ఏమి చేయాలో నిర్ణయించుకోవలసినది మనమే !" అని.



సాయి అటు భుక్తికి, ఇటు ముక్తికి వారధి. కాబట్టి సాయిబాబాను ఎవరు నిజాయితీగా సహాయం అడిగితే ఇటు ఇహానికి, అటు పరానికి అది వారికి తప్పక లభించి తీరుతుంది. అయితే ఆ నిజాయితీకి కొలబద్దలు, కొలమానాలు అంటూ లేనే లేవు. భక్తులు ఎంత ఆర్ద్రతతో అర్థిస్తారో, సాయి కూడా అదే విధంగా స్పందిస్తారు. **ఒక్కసారి సాయి బాబా భక్తుడైతే చాలు. జన్మజన్మాంతరాలవరకు అంటే... ఆత్మసాక్షాత్కారం కలిగే వరకు సాయి తన భక్తుణ్ణి కాపాడుతూనే వుంటారు.**

**- సర్వం శ్రీ సాయినాథార్పణమస్తు -**

29

31

30

1

1

1

1

1

1

1

1

1

1

1

1

1

1

1

1

1